



ఆ వారానికి చేయవలసిన 'రికార్డు వర్కు'ను పూర్తిచేసి, ఏదో పెద్ద బరువు దిగిపోయినట్లు అనుభూతి చెందాను. ఎదురుగా ఉన్న, టైమ్‌పీస్ వైపు చూశాను. ఎనిమిదన్నరయింది. కాలేజికి ఇంకా గంటన్నర టైముంది. 'బుక్ షెల్ఫ్'లో నుండి ఫిజికల్ కెమిస్ట్రీ టెక్స్టు తీశాను, ఏదైనా చదువుదామని కాని బుర్ర పనిచేయడం మానివేసింది. 'రిలీఫ్' కావాలనిపించింది. కుర్చీలో నుండి లేచి పక్కగదికి వెళ్ళాను. వీక్లీ తీసుకొని, మరలా నా గదికివచ్చి కుర్చీలో కూలబడ్డాను. పుస్తకం తెరిచి మొదటగా కనిపించిన కథ చదవడం ప్రారంభించాను. అధికారములో ఉన్న ఒక రాజకీయవేత్త దురహంకారం వలన ఒక కుటుంబం పడిన కష్టాలను, ఆ కథలో చక్కగా వర్ణించాడు రచయిత. కథ చాలా బాగుంది. కాని ముగింపులో రచయిత వెలిబుచ్చిన అభిప్రాయం మాత్రం ఆక్షేపణీయంగా ఉన్నది. 'మనదేశంలోని రాజకీయ వేత్తలంతా పరమ కిరాతకులు. పడగ విప్పి కాటు వేయడానికి సిద్ధపడ్డ కాలసర్పన్నైనా నమ్మవచ్చును. కాని వీరిని మాత్రం నమ్మరాదు.' అన్న రచయిత అభిప్రాయంతో ఏకీభవించలేకపోయాను.

'మేధావులందరికీ రాజకీయ నాయకులను, ముఖ్యంగా పదవిలో ఉన్నవారిని ఆధిక్షేపించడం అలవాటయింది. నిజంగా మన నాయకులంతా దుర్మార్గులయినట్లయితే, అందుకు బాధ్యులు ఎవరు? 'యథా రాజా తథా ప్రజా' అన్న రోజులు పోయాయి. మనది ప్రజాస్వామ్యం. ఈ వ్యవస్థలో 'యథా ప్రజా తథా పాలకా.' మన నాయకులను సరియైన త్రోవలో పెట్టాల్సిన బాధ్యత ప్రజలది కాదా?' ఇలా సాగినవి నా ఆలోచనలు.

అగాధంవంటి రాజకీయాలను గురించి ఆలోచిస్తూ ఉంటే, కాలం విలువ తెలియకుండా పోతుందని మనసు హెచ్చరించడంతో ఆ ఆలోచనలకు స్వస్తి చెప్పి, కుర్చీలో నుండి లేచాను' బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ.

ఇంతలో, గేటు తెరచిన చప్పుడయింది. కిటికీలోనుండి తొంగిచూశాను. నీరసంగా అడుగులు వేస్తూ లోపలికి వస్తున్న మామయ్య కనిపించాడు.

సంతోషంతో ముఖం విప్పారగా, 'ఊరి నుండేనా రావడం? అంతా క్షేమమే కాదా?' అని అడిగాను. ఆయనకు ఎదురు వెళ్ళుతూ.

'ఆహా'' అంటూ అలవాటు చొప్పున డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు.

ఆయన కెదురుగా కూర్చుంటూ 'ఏమిటి మామయ్యా, అలా ఉన్నావు?' అన్నాను ఆయన ముఖంలోని చూస్తూ.

'అనువైన ప్రదేశంలో కట్టించవయ్యా

అని నే చెప్పినమాట వినకుండా, 'ప్రశాంతంగా ఉండాల' అంటూ, నానాటి కాలనీకి దగ్గర . ఇల్లు కట్టించాడు మీ నాన్న. ఇక్కడకు రావడానికి మంచి రోడ్డు కూడా లేదు గతుకుల రోడ్డు మీద రిక్షాలో వచ్చేప్పటికి, తలప్రాణం తోకకు వచ్చింది. ఒళ్ళంతా ఒకటే 'నొప్పి' అన్నాడు ఆయాసం . ఆయన మాటల ధోరణికి అలవాటుపడ్డ నేను చిన్నగా నవ్వుకున్నాను

'ఒక మంచిరోడ్డు వేయించకూడదట్రా మీ నాన్న. ఊళ్లో బాగా పలుకుబడి గల వ్యక్తి. పైగా మునిసిపల్ కౌన్సిలర్. ఆ మాత్రం చెయ్యలేడా' అన్నాడు.

'తలచుకుంటే చెయ్యగలరు. కాని ఎందుకో ఆ ఆలోచన కలగలేదు ఆయనకు' అన్నాను.

'మీ నాన్న మనసులో ఏముందో ఎవరికి తెలుసు ?' అర్థవంతంగా నవ్వారాయన.

నేను ఏమి అనలేదు.

ఒక్కక్షణం ఆగి, 'ఏమిట్రా, ఇంట్లో ఎవ్వరూ లేరా ఏమిటి ? నిశ్శబ్దంగా ఉంది' అని అడిగాడు.

'అమ్మా నాన్న, ఏదో పెళ్లి ఉందని కడప వెళ్లారు మొన్న. ప్రొద్దుటికల్లా తిరిగి వచ్చేస్తున్నారు. కాని ఇంతవరకూ రాలేదు. సరళ, లోపల పనిచూసుకుంటుంది' అని లోపలకు వెళ్లాను సరళను పిలవడానికి. వంటగదిలో 'ఫీట్స్' వేస్తూంది సరళ.

'సరళా ! మామయ్య వచ్చాడు' అన్నాను.

'ఏదవ విట్లు వెయ్యకురా బాబు. ఇక్కడ పని తెములక ఛస్తూ ఉంటే,' విసుక్కొంది.

'ఎప్పుడు 'విట్లు' వెయ్యాలో ఆ మాత్రం తెలియదనుకున్నావా ఏమిటి ? నిజం చెప్తుంటే నమ్మకపోతే ఎలా ? 'డ్రాయింగ్ రూమ్'లో ఉన్నారు వచ్చి చూడు' అంటూ అటువైపు అడుగులు వేశాను.

నా వెనకాతలే వచ్చిన సరళ, మామయ్యను చూడగానే సంబర పడిపోతూ 'ఇదేనా రావడం? అంతా బాగున్నారు? కదా'' అంటూ కుశల ప్రశ్నలు వేసింది.

'బాగా' నవ్వారు మామయ్య సమాధానంగా.

'కాళ్లు చేతులు కడుక్కొని రా మామయ్య. టిఫన్ తీసుకొందువుగాని' అంది సరళ.

'ఇప్పుడేమి వద్దమ్మా. ఇంతకుముందే తీసుకొన్నాను రంగారావుగారింట్లో.'

'అదేమిటి? అక్కడి కెందుకెళ్లావు మామయ్యా?' అని అడిగాను.

'సూట్ కేస్ పెట్టడానికి వెళ్లాను.'

'అక్కడెందుకు పెట్టడం ?'

'హైదరాబాదు వెళ్లవలసిన పని ఉన్నది. ఒకమారు మిమ్మల్ని చూసి వెళదామని ఇలా వచ్చాను. వెంటనే వెళ్లిపోవాలి. 'సూట్ కేసు'ను ఇంత దూరం మోసుకురావడం ఎందుకనిపించి, బస్సు దిగగానే, సరాసరి రంగారావుగారి ఇంటికి వెళ్లి, దానిని అక్కడ పెట్టి వచ్చాను' అన్నాడు వివరిస్తూ.

'ఇప్పుడు వెళ్ళడానికి బస్సు కూడా లేదు. ట్రెయిన్ నాలుగింటికి కదా ?' అన్నాను.

'తెనాలిలో ఒక స్నేహితుడిని కలుసుకోవాలి. టాక్సీలో తెనాలి వెళ్లి, అక్కడనుండి రాత్రికి 'ఎక్స్ ప్రెస్'లో హైదరాబాదు వెళతాను.'

'ఇంతకి హైదరాబాదు ఎందుకు వెళ్లుతున్నట్టు ?' అని అడిగాను.

'ఆమధ్య, 'అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగానికి 'అప్లై' చేశాడు మీ బావ. 'ఇంటర్వ్యూ'కు రమ్మని పిలుపు వచ్చింది సర్వీస్ కమీషన్‌నుండి. ఈ విషయంలో, మంత్రిగారిని కలుసుకోడానికి వెళ్లుతున్నాను' అన్నారు

'బావకు 'రికమెండేషను' ఎందుకు మామయ్యా. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు గదా? ఆ ఉద్యోగం తప్పకుండా వస్తుంది' అన్నాను.

'ఓరి పిచ్చిమొద్దా ! ఈ కాలంలో 'మెరిట్'మీద ఆధారపడితే లాభం లేదురా? గట్టి 'రికమెండేషన్' ఉండాలి. ఆ ఉద్యోగం తప్పకుండా వస్తుందన్న ధీమాతో ఏ ప్రయత్నము చెయ్యకుండా ఇంట్లో కూర్చుంటే, మరెవడో పలుకుబడి ఉపయోగించి, తన్నుకు పోతాడు. అప్పుడు ఏడవాల్సి వస్తుంది' అన్నారు, ప్రస్తుత పరిస్థితిని సమీక్షిస్తూ.

'అయితే ఇంతకీ మంత్రిగారిని ఇబ్బంది పెట్టడానికి వెళుతున్నావన్నమాట' అన్నాను.

'ఇందులో, ఏముందిరా ఆయన ఇబ్బంది పడడానికి? ఆ మాత్రం చేయలేడా ఏమిటి ? ఎన్నికలు సమీపిస్తున్నాయి కదా? రేపు పొద్దుట ఏ ముఖం పెట్టుకొని నా దగ్గరకు వస్తాడు ? నీకు తెలియనిది కాదుగా, మా ప్రాంతంలో నాకున్న పలుకుబడి. నన్ను కాదని ఆయన తలెత్తుకు తిరగగలడా ?' అన్నారు మామయ్య కొంచెం గర్వంగా.

ఏమీ మాట్లాడలేకపోయాను నేను.

రెండు నిముషాలు గడిచాయి.

'ఇక వెళతానురా' అంటూ లేచారు మామయ్య.

'ఇలా వచ్చి అలా వెళ్లిపోవడం బాగా లేదు మామయ్య. కనీసం నాలుగురోజులు ఉంటావనుకున్నాను' అన్నది సరళ నిష్ఠురంగా.

'పదిరోజుల తర్వాత నేను మీ అత్తయ్య కలిసి వస్తాము. అప్పుడు నాలుగు రోజులు కాదు, వారంపాటు ఉంటాము. సరేనా' అన్నారు నవ్వుతూ.

'ఐదు నిముషాలు ఆగు మామయ్యా. బట్టలు మార్చుకొని వస్తాను. స్కూటర్ మీద వెళదాం' అన్నాను.

'నీ కంత శ్రమ ఎందుకురా? తిరిగి వచ్చేంతవరకు ఆగమని రిక్షావాడితో చెప్పాను. అందులోనే వెళతాను' అన్నారు.

మామయ్య వెళ్లిన తరువాత, ఐదు నిముషాల్లో తయారయ్యాను.

'ఇవాళ కూడా కాలేజికి గైరు హాజరన్న మాట' అన్నాను సరళ నుద్దేశించి.

'మరి ఏమి చెయ్యమంటావు?' ఉన్నది విసుక్కొంటూ.

'సరే. నే వెళుతున్నాను. ఇల్లు జాగ్రత్త.' అంటూ స్కూటర్ స్టార్టు చేశాను.

కాలేజి ఆవరణలో ప్రవేశించేసరికి ఫస్ట్‌బెల్ మోగుతోంది. స్కూటర్‌ను షెడ్‌లో పెట్టి చుట్టూ చూశాను

'నా క్లాస్‌మేట్స్' ఎవ్వరూ చెట్టు కింద లేరు. 'కాంటీన్‌లో గాని, 'లైబ్రరీ

క్చరీలో గాని చివరకు, 'ఆఫీస్' వద్ద గాని లేరు. 'ఏమయ్యారు చెప్మా?' అను కుంటూ క్లాస్‌రూమ్'కు వెళ్ళాను.

అక్కడ, గుంపుగా నిలుచుని మాట్లా డుకుంటున్నారు.

సుబ్బారావు కాబోలు; 'రాత్రితో ఆయన పాపం పండింది గురూ' అంటున్నాడు. విషయమేమిటో అర్థం కాలేదు.

ప్రక్కనేఉన్న ఉమాపతిని అడిగాను 'ఏమిటో గొడవ' అని.

'మాథమేటిక్సు లెక్చరరు మాధవరావు గారు, రాత్రి 'బృందావన్ లాడ్జి'లో రాస క్రీడలో మునిగివున్న సమయములో, పాన కంలో పుడకలాగా పోలీసులు వచ్చి అరెస్టు చేశారట. ప్రస్తుతం, శ్రీ కృష్ణ జన్మ స్థానంలో అతిధి మర్యాదలతో సత్క రిస్తున్నారు' అన్నాడు హేళనగా.

అతడి మాటలు విని, బరువుగా నిట్టూ ర్చాను. ఇలాంటివి తరచుగా జరుగు తున్నాయి.

భావి భారత పౌరులకు వెలుగుబాట చూపించ వలసిన ఉపాధ్యాయులే, ఇలా నైతికంగా పతనమయితే, దేశం బాగుపడే దెప్పుడు ? ఇలాంటి ఉపాధ్యాయులనుండి విద్యార్థులు నేర్చుకునే దేమిట ? అయినా, అవసరమైన విద్యార్హతలున్న ప్రతి ఒక్క డినీ, మిగతా గుణాలతో నిమిత్తం లేకుండా అధ్యాపక వృత్తిలో నియమిస్తే, దేశం, అధోగతి పాలుగాక మరేమవుతుంది ?

# ఎవరు నీచులు?

ఇంతలో 'థర్డ్ బెల్' మ్రోగడంతో, ఆలోచనలకు స్వస్తిచెప్పి, 'కెమిస్ట్రీ లాబ్' వైపు దారితీశాను. ఉదయం పూట కెమిస్ట్రీ ప్రాక్టికల్సు ఉన్నాయి. హాజరువేయించుకొని, రికార్డు 'సబ్‌మిట్' చేసి, నా సీటువద్దకు వెళ్ళాను. సొరుగు తాళంతీసి, పరికరాలన్నీ తీసి 'వర్క్‌బెంచ్' మీద పెట్టాను. త్వరత్వరగా పరికరా లన్నీ శుభ్రం చేయసాగాను. ఇంతలో 'డిమాన్‌స్ట్రేటర్' వచ్చి ఆ రోజు చేయ వలసిన ప్రయోగముగురించి క్లుప్తంగా వివరించాడు. అప్రయత్నంగా నా కళ్ళు, ప్రక్కసీటులో ఉన్న ప్రభాకరరావు మీద పడ్డాయి. అతను 'బ్యూరెట్' ను చేతిలో పట్టుకొని, దాని వైపు చూస్తున్నాడు. ఒక్కక్షణం ఆగి, 'అటెండర్' తగ్గరకు వెళ్ళాడు.

'ఇదిగో సామ్యూల్, దీన్ని తీసుకొని మరో 'బ్యూరెట్' ఇవ్వు. 'స్టాప్ కాక్' వదులైపోయింది. 'లిక్విడ్‌ఫ్లో'ను 'రెగ్యు లేట్' చెయ్యలేక చస్తున్నాను. ప్రయోగం చెయ్యడం బాగా ఆలశ్యమవడమేకాకుండా, ఫలితం కూడా సరిగ్గా రావడం లేదు' అన్నాడు అసహనంగా.

'మీకు ఎన్నిమార్లు చెప్పాలండి, 'బ్యూరెట్లు' లేవని—అందరికీ, తలొ కొకటి చొప్పున ఇచ్చాము. మీ ఖర్మ కొద్దీ ఇలాంటిది దొరికింది. ఎలాగో తంటాలుపడండి' నిర్లక్ష్యముగా సమా ధాన మిచ్చాడు సామ్యూల్.

'క్రొత్త బ్యూరెట్లు' ఉన్నాయట గదా: నీ అసిస్టెంటు క్రిష్ణమూర్తి చెప్పాడు,' ప్రభాకరరావు కోపంగా అన్నాడు.

'అవి వాడవద్దని 'హెడ్' చెప్పా రండి' విసుగ్గా అన్నాడు సామ్యూల్.

కోపముతో వూగిపోయాడు ప్రభాకర రావు.

'ప్రభుత్వ కళాశాలల్లో వసూలు చేసే ఫీజు కన్నా దాదాపు రెట్టింపు 'ఫీజు' వసూలు చేస్తున్నారు. కాని, ఒక్కటీ సరియైన పరికరం లేదు. 'వైర్‌గాజు' తుప్పుపట్టి ఉన్నాయి. చాలా వాటికి మధ్యలో చిల్లులు ఉన్నాయి. 'ఫన్నెల్స్' అంచులు విరిగి ఉంటాయి 'బర్నర్స్' సరిగ్గా పనిచేయవు. 'ఫ్లాస్కు స్టాండ్' 'టెస్ట్ ట్యూబ్ హోల్డర్లు' అసలే లేవు. 'బ్రష్లు' నాలుగో, ఐదో ఉన్నాయి. 'క్లేపైప్ ట్రయాంగిల్స్' మధ్యమధ్య విరిగిపోయి అతుకుల బొంత ల్లాగా ఉంటాయి. స్టాండులు సరియైన ఆకారంలో ఉండవు 'బ్యూరెట్లు' ఇలా తగలబడ్డాయి. 'టెస్టుట్యూబులు' జిడ్డుగా ఉంటాయి. గడచిన రెండు సంవత్సరాలు ఇలాగే అవస్థపడ్డాము. ఇంకా ఎన్నిరోజులు అవస్థ పడమంటారు?' అక్కసునంతా వెళ్ళగక్కాడు.

అతడు చెప్పినదాంట్లో అసత్యం ఏమీ లేదు. కాని నిజం ఎప్పుడూ నిష్ఠూరం గానే ఉంటుంది. అతడి మాటలు విన్న 'అటెండరు' రెచ్చిపోయ్యాడు.


నోటిని అదుపులో పెట్టుకోండి. అనవ సరంగా మాట్లాడితే మర్యాదగా ఉండదు' హెచ్చరించాడు.

ఇంతలో 'డిమాన్‌స్ట్రేటరు' పరు గెత్తుకుంటూ వచ్చాడు.

'నిలాగో సర్దుకుపోవాలయ్యా. ఇలా గొడవచేస్తే, ఒరిగేదేమీ ఉండదు.' 'హెడ్ వింటే కొంప మునుగుతుంది' అంటూ నచ్చచెప్పి, ప్రభాకరరావును అతని సీటు వద్దకు తీసుకువచ్చారు.

బరువుగా నిట్టూర్చి ప్రయోగం చెయ్య డంలో నిమగ్నమైపోయ్యాను.

'స్టాండర్డ్ ఆగ్జాలిక్ యాసిడ్'ను



తయారుచేసి, దాని సాయంతో 'పొటాషియం పర్మాంగనేటు'ను 'స్టాండర్డైజ్' చేశాను. 'డిమాన్‌స్ట్రేటరు' తయారు చేసి ఇచ్చిన 'ఆగ్జాలిక్ యాసిడ్'ను 'ఎస్టిమేట్' చేద్దామని వంద సి. సి. ఫ్లాస్కు చేతిలోకి తీసుకుంటూ ప్రభాకరరావు వైపు చూశాను.


అతడింకా 'పొటాషియమ్ పర్మాంగనేటును' స్టాండర్డైజ్ చెయ్యలేదు. వేడిచేసిన 'కానికల్ ఫ్లాస్క్'ను 'బ్యూరెట్' కిందపెట్టి, 'పొటాషియమ్ పర్మాంగనేటు'ను 'ఫ్లాస్క్'లో ఉన్న ఆగ్జాలిక్ మరియు డైల్యూట్ సల్ఫ్యూరిక్ యాసిడ్ల మిశ్రమానికి, బొట్లు బొట్లుగా కలపబోయాడు. కాని 'స్టాప్ కాక్' వదులైనందున, అతని ప్రయత్నం ఫలించలేదు. 'పర్మాంగనేటు' ఒక్కసారిగా ధారగా కారసాగింది, ప్రక్క అగుండా వచ్చింది 'వర్క్‌బెంచ్' పాడవుతుందన్న గాభరాలో 'స్టాండ్'ను ముందుకు లాగడు అసలే మనసు సరిగా లేదేమో కాస్త బలంగా లాగినట్టున్నాడు 'స్టాండ్'ను. స్టాండ్ దానితోబాటు 'కానికల్ ఫ్లాస్కు' క్రింద పడ్డాయి. 'బ్యూరెట్' ఫ్లాస్క్ రెండూ పగిలిపోయాయి. ఏదో పనిమీద 'లాబొరేటరీ'లోనికి వచ్చిన 'హెడ్ ఆఫ్ ది కెమిస్ట్రీ డిపార్టుమెంటు' 'డిమాన్‌స్ట్రేటరు—'అటెండరు' పరుగెత్తుకు వచ్చారు, 'ఏం జరిగిందంటూ' అక్కడి దృశ్యాన్ని చూసి 'ఒళ్లుదగ్గర పెట్టుకొని చెయ్యాలయ్యా ఎక్స్‌పరిమెంటు' అన్నాడు హెడ్.

ఆయన మాటలు వినగానే, నాకు అరికాలి మంట నడినెత్తికెక్కింది.

'ఇదంతా మీ నిర్లక్ష్యంవల్లనే జరిగింది. అరిగిపోయిన పరికరాలు ఇవ్వకపోతే ఇలాగే జరుగుతుంది' అని చెప్పాలనుకొని నోరు తెరవబోయాను.

ఇంతలో 'బ్రేకేజ్‌నోట్ చేసుకొని సంతకం చేయించుకో', సామ్యూల్'తో అన్న హెడ్ మాటలు వినిపించాయి.

ఆ పగిలిపోయిన పరికరాలు ఎంత పాతవైనప్పటికీ వాటి పూర్తి ఖరీదుకు, 'జనరల్ బ్రేకేజి ఫైన్' కలిపి వసూలు చేస్తారు అందుకే ప్రభాకరరావు 'అవవి చేయించి సార్ చాలా బీదవాడిని. ప్రతీ ఏడూ, 'జనరల్ బ్రేకేజ్' కింద మీరు విధించే 'ఫైన్'నె చెల్లించలేకపోతున్నాను,



అల్లినట్లు కన్పించే 'నోడ్కా' బాడీ, బట్టలతో లిస్‌గ్రే. ముదురురంగు కల సౌందర్యవంతమైన 'జన్' బాడీ, బట్టలని ధరించిన లిసీ, రెండూ నైలాన్‌తో తయారుచేసినవే. (—నాఫెన్)

ఈ 'ఫైన్' అసలే చెల్లించలేను. ఏం చేస్తున్నారో తెలియని అయోమయావస్థలో ఇలా జరిగిపోయింది' అంటూ దీనంగా అర్థించాడు.

అదనుకొరకు ఎదురు చూస్తున్న సామ్యూల్, ఇంత క్రితం 'బ్యూరెట్' విషయంలో తమ మధ్య జరిగిన సంభాషణను వివరించి చెప్పారు. హెడ్‌కి. దాంతో, అసలే కోపిష్ఠి అయిన 'హెడ్' మరీ రెచ్చిపోయారు.

'ఏమోయ్, ఇందాక అలా అన్నావుట? 'పేదవాని కోపం పెదవికి చేటు' అన్న సంగతి తెలియదా? తోక తెగ్గోస్తాను జాగ్రత్త' అన్నారు.

ఒక్కసారి చుట్టూ కలయజూశాను. అందరి ముఖాల్లో అసహ్యం, క్రోధం, ఇత్యాది భావాలు ప్రస్ఫుటమవుతున్నాయి. ఆ ముఖాల్లోని భావాలు నాకు ధైర్యాన్నిచ్చాయి. 'అసలికి తోక లేదండి మీరు తెగ్గోయ్యడానికి' అన్నాను కోపంగా.

హెడ్ నా వైపు తిరిగి 'ఓహో! నీవా గోపాలరావుగారూ! ఒక కొత్త సత్యాన్ని చెప్పినందుకు కృతజ్ఞుణ్ని. కాని అనవసరంగా జోక్యం చేసుకొని, హద్దు మీరితే పరిణామాన్ని అనుభవించవలసి వస్తుంది' అన్నారు హేళనతో కూడిన తీవ్ర స్వరంతో.

'నేనేమీ హద్దు మీరడం లేదు. అనవసరమైన జోక్యం చేసుకొంటున్నారు కాలేజీలో చేరినప్పుడు, వందలకొద్దీ డొనేషన్లు వసూలు చేశారు. ఫీజుల రూపంలో చాలా డబ్బు వసూలు చేశారు, చేస్తున్నారు. కాని విద్యార్థులకు కావలసిన సౌకర్యాలు మాత్రం శూన్యం. మన 'లాబ్'లో ఉన్న పరికరాల సంగతి మీకు తెలుసు. కాని వాటితో విద్యార్థులెలా అవస్థపడేది సంగతి మీకు అనవసరం లేదు. 'మేనేజిమెంట్'లో చెప్పి, కావలసిన పరికరాలు ఎందుకు తెప్పించగూడదు? ఆ పని మీకు చేతగాకపోతే చెప్పండి, మేమే చూసుకొంటాము. 'లేబరేటరీ' డిపాజిట్ వసూలు చేయలేదంటూ సంవత్సరం చివర మీ ఇష్టం వచ్చినంత డబ్బు 'ఫైన్' రూపంలో వసూలు చేస్తున్నారు. ఎప్పుడయినా కదుపుమండి, ఏదైనా అంటె. 'క్రమశిక్షణకు భంగకరం' అంటారు.

# ఎవరు నీచులు?

'మీ తోక తెగ్గోస్తాం, మీ అంతు తేలుస్తాం, అది చేస్తాం, ఇది చేస్తాం' అంటారు. ఎక్కడుందండి న్యాయం? ఇలాంటి పరిస్థితులలో అధ్యాపకులమీద, విద్యాసంస్థలమీద గౌరవం ఎలా ఉంటుంది?' అంతకన్నా తీవ్రంగా అన్నాను.

ఇట్లా మాట్లాడతానని ఊహించని 'హెడ్' మ్రాన్పడిపోయారు. రెండు నిముషాల తరువాత తేరుకొని, 'అంత వరకు వచ్చిందన్నమాట వ్యవహారం. సరే. చూస్తాను' అంటూ అడుగు వేశారు.

''బేకే జెన్' విషయం చెప్పారు కారు' అంటూ ప్రభాకరరావు, ఆయన్ను అనుసరించబోయాడు.

'ఆగవోయ్ ప్రభాకర్' అన్న ముకుందరావు గర్జన విని ఆగిపోయాడు. ఆతడితో బాటు హెడ్ కూడా ఆగారు

'తప్పంతా నీదే అనుకో. వారి ఇష్టం వచ్చినట్లు చేసికోనివ్వు. ఎంత 'ఫైన్' వేస్తారో వెయ్యనియ్యి నీ స్నేహితులు నలభైమంది ఉన్నాము. మేమంతా చందాలు వేసికొని ఆ డబ్బు కడతాము' అన్నాడు ముకుందరావు.

అందరి వైపు ఒక్క క్షణం తీక్షణంగా చూసి, ముందుకు వెళ్ళిపోయారు 'హెడ్'. 'ప్రిన్సిగారితో చెబుతారేమో. ఆయననే అడగవలసిన నాలుగు అడుగుదాం' అన్నారంతా, కాని ప్రిన్సిపాల్ గారు మమ్మల్నేమీ అడగలేదు.

మిగిలిన ప్రయోగాన్ని ఎలాగో ముగించి బయట పడ్డాను.

మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్ళాను. అమ్మా, నాన్నా ఇంకా వచ్చినట్టు లేదు. భోజనం వడ్డిస్తూ, 'ఆ ప్రముఖ పక్షపత్రిక సంపాదకుడి దగ్గర నుండి, నీకు ఉత్తరం వచ్చిందిరా.' అన్నది 'ప్రముఖ' అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ.

'ఏమని వ్రాశారు?' ఆత్రుతగా ప్రశ్నించాను.

'ఎందుకంత తొందర? భోజనము కానియ్ చదువుదువుగాని' అన్నది.

త్వరత్వరగా భోజనం ముగించి లేచాను. చేయి కడుక్కొని టవలుతో తుడుచుకుంటూ ఉండగా, సరళ ఉత్తరం తెచ్చియిచ్చింది ఆసక్తిగా చదువసాగాను.

'డియర్ సర్!'

మీ ఉత్తరం అందినది. కళాశాల విద్యార్థులకు, మేము నిర్వహించిన వ్యాసరచన పోటీలో, ద్వితీయ బహుమతి పొంది, ప్రచురింపబడిన మీ వ్యాసానికి, ప్రకటించిన పారితోషికాన్ని, ఇంతవరకు పంపలేకపోయినందుకు చింతిస్తున్నాము. పత్రికా నిర్వహణలో ఉన్న ఆర్థిక ఇబ్బందులు మీకు తెలియనివి కావు. ఒక నెలలోపుగా, మీ బహుమతిని అందచేస్తాము. ఆలశ్యమైనందుకు మరోలా భావించవద్దు' అని ఉన్నది ఆ ఉత్తరంలో.

'పాతిక రూపాయలకోసం, ఇంత తాపత్రయం దేనికిరా నీకు? వాళ్ళిచ్చే ఆ పాతిక రూపాయలతో, నీవు లక్షాధికారి వైపోవు. ఇలాంటి పాతికలు ఎన్ని ఖర్చు పెడుతున్నావు నెలనెలకి? పారితోషికం ఇవ్వనప్పుడు వాళ్ళకు ఉత్తరాలు వ్రాయడం మానెయ్' అన్నది సరళ, విసురు కోపంతో.

'పాతిక రూపాయలకోసం కాదు నేను బాధపడుతూంట. ఆ సంపాదకునిలోని అవినీతిని గురించి బాధపడుతున్నాను. ఆయన సంపాదకీయాలు నీవు చదవలేదులా ఉంది. లోకంలో జరుగుతున్న అన్యాయాలను గురించి, వాటికి కారకులైన వారిని గురించి ఎంతో తీవ్రమైన భాషలో వ్రాస్తూ ఉంటారు మరి. తనలోని లోపాలను గ్రహించరెందుకని? ప్రకటించిన పారితోషకం సకాలంలో అందించకుండా ఆలస్యం చెయ్యడం అవినీతి కాదా? డబ్బు ఎగవెయ్యాలని అనుకుంటున్నారు కాబోలు. బాధ్యతగల పదవిలోనున్న వ్యక్తులే ఇంత అవినీతి చేస్తుంటే, ఒక సామాన్య మానవుని గతి ఏమిటి?' అన్నాను ఉద్రేకంగా.

'ఏమిటో నీ పిచ్చి సిద్ధాంతాలు, ఒకరు చెప్పిన మాట వినిపించుకోవుగదా?' అంటూ తన గదిలోకి వెళ్ళింది సరళ

నేనూ, నా గదికి వచ్చి, కుర్చీలో కూలబడ్డాను. ఆ సంపాదకుని విచిత్ర ప్రవర్తనను గురించి ఆలోచిస్తూ అలాగే కూర్చుండిపోయాను. ఆలోచనలనుండి తేరుకునేప్ప

టికి, ఒంటిగంటన్నర - అయింది. వెందుకో ఆ పూట కాలేజీకి వెళ్లాలని పించలేదు. తలనొప్పిగా ఉన్నట్లు అని పించింది. బట్టలు కూడా మార్చుకో కుండా, మంచంమీద వాలిపోయాను.

ఇంతలో, ఫోన్ గణగణ మోగింది. ఆ 'కాల్'ను సరళ 'రిసీవ్' చేసుకుంటుందిలెమ్మని అలాగే పడుకున్నాను. సరళ కూడా నాలాగే అనుకుందేమో, ఆ ఫోన్ అలా మోగుతూనే ఉంది. విసుగ్గా లేచి వెళ్లి, దానిని అందుకున్నాను.

'నేను భూషణరావుగారి అబ్బాయిని మాట్లాడుతున్నాను. ఏం కావాలి మీకు'

'నేను బాబూ! మేనేజర్‌ను మాట్లాడు తున్నాను.' అవతలినుండి మాహాల్ మేనే జరుగారు పలికారు.

'ఓ మీరా! ఏమిటి విశేషం', అడిగాను కుతూహలంగా,

'విశేషాలు ఏముంటాయి బాబు? ఏదో వ్యాపార గొడవలు తప్ప. అదిసరే, ఇంకా నాన్నగారు రాలేదా' ఆదుర్దాగా అడిగారు.

'రాలేదండి. మేముకూడా ఎదురు చూస్తున్నాము వారికోసం' అన్నాను.

'ఉదయానికే వస్తామన్నారు గదండి. ఇంతవరకు రాలేదంటున్నారు ఇప్పుడెలా?' తనలో తానే మాట్లాడుకుంటున్నట్లు చిన్నగా గొణిగారు మేనేజర్.

'ఏమిటలా ఆతృత చెందుతున్నారు? ఏవైనా ముఖ్యమైన వ్యవహారాలు ఉన్నాయా?'

'అవునండి, ముఖ్యమైన వ్యవహారమే ఉంది'

'ఆవిషయమేదో, నాకు చెప్పకూడదా?'

'ఇందాక చెప్పానుగదా. వ్యాపారపు గొడవలని అవి మీకెందుకు లెండి?'

'చదువయ్యాక, ఇంటి పట్టునే ఉండి, ఈ గొడవలేగదా నాన్నగారు చూసుకో మంటున్నారు మీరేమో. ఆ గొడవల గురించి పట్టించుకోవద్దంటున్నారు. పరవాలేదు. ఆ విషయమేమిటో చెప్పండి. తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది' అన్నాను.

ఒక్కక్షణం తటపటాయించి 'పెద్ద రహస్యం ఏమీ కాదు బాబూ. ఈ ప్రాంతానికి కొత్తగా కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ వచ్చారు. ఆ అధికారికి స్వాగతం ఇవ్వడానికి, పాత ఆఫీసరుకు వీడ్కోలు ఇవ్వడానికి, సాయంత్రం ఒక 'పార్టీ' ఏర్పాటు చేశారు. దానికి ముందుగానే వసూలుచేశారు, ఆ ఆఫీస్ సిబ్బంది. అది వేరే విషయం. కాని క్రొత్త ఆఫీసరుకు లంచాలంటే చాలా ప్రీతి అట ఆయనను సుముఖుడిగా చేసుకోవడం అవసరంకదూ? ఉత్త చేతులతో వారి దర్శనానికి వెడితే బాగుండదు నాన్నగారు ఉంటే, ఆలో చించి, ఏదో చేసేవాళ్లం ఆయన లేరు కదా? ఇప్పుడు ఏం చెయ్యాలో తోచ కుండా ఉంది' అన్నారు

'మనం నిజాయితీగా ఉంటే ఆయనకు భయపడవలసిన అవసరంలేదు గదండి' అడిగారు.

'వ్యాపారంలో నీతికి, నిజాయితీకి స్థానం లేదు బాబూ మీరింకా చిన్నవారు. అను భవంలేని వారు మీరు ఇలాగే మాట్లాడు తుంటారు. కాని మావంటి వాళ్లకు తెలు స్తుంటాయి అందులోని కష్టసుఖాలు' అన్నారు.

ఆయన సమాధానం విని బరువుగా నిట్టూర్చాను. ఆయనతో వాదనకు దిగడం అనవసరం అనిపించింది.

'ఎన్ని ముఖ్యవిషయాలలో తన సలహా సంప్రదింపులకోసం వేచిఉండాల్సి వని గదా. మీరు ఎలా మంచిదని తోస్తే, అలా చెయ్యమని ఎప్పుడో చెప్పారు గదా నాన్న గారు ఇంకా, మీకు సంశయమెందుకు? ఏదో జరిగేటట్టు చెయ్యండి' అన్నాను సంభాష ణను తుంచివేస్తూ.

నా గదికి వెళ్లబోతూ, 'దండాలు బాబుగోరూ' అన్న వ్యక్తిని చూసి ఆగి పోయాను. ఎన్నికల సమయంలో, నాలు గైదుసార్లు మా ఇంటికి వచ్చి నాన్న గారితో మాట్లాడిన సందర్భాలు జ్ఞప్తికి వచ్చినందువలన, అతడిని వెంటనే గుర్తు పట్టగలిగాను.

'ఏం వీరయ్యా? ఇలా వచ్చావు?' సౌమ్యంగా ప్రశ్నించాను.

ఒక్కక్షణం తటపటాయించి, 'పెద్దయ్య గోరు ఉన్నారా బాబూ' అని అడిగాడు.

'లేరు కడపకు వెళ్లారు.'

నా సమాధానంతో, వీరయ్య ముఖం పాలిపోయింది. ఒక్కనిముషం తరువాత,


'అమ్మగోరు ఉన్నారా' అని అడిగాడు.

'లేరు అమ్మగారు కూడా వెళ్లారు' అన్నాను.

'అట్నాగా బాబు' నెమ్మదిగా గొణిగాడు. అతడి ముఖంలో విషాదం గూడు కట్టుకొని ఉన్నట్లు అనిపించింది. అతడి వాలకాన్ని చూసి జాలివేసింది.

'ఏదో పనిమీద వచ్చినట్లున్నావు. అదేమిటో చెప్పు. వీలుంటే సహాయం చేస్తాను' అన్నాను.

నా మాటలు వినగానే అతడి ముఖం సంతోషంతో విప్పారింది 'చల్లటిమాట సెలవిచ్చారు బాబూ, అయినా, నా పిచ్చి



గాని, దరకు పెబువు కడుపున. వన్నాసి వుంటాడా' అన్నాడు.

'సర్లే. పొగడ్తలు తర్వాత అసలు సంగతేమిటో చెప్పు' అన్నాను, అతడి పొగడ్తలను స్వీకరించే ధైర్యంలేక.

'ఆ మాటలతో అతడి ముఖం ముడుచుకు పోయింది.

'నాకు పన్నెండేళ్ల కొడుకు ఉన్నాడయ్యా. ఆడి అమ్మ ఏడేళ్ల కిందట సచ్చిపోయింది అడనుంచి ఆడికన్నీ నేనే. గారాబంగా పెంచుతున్నా. ఏడుదినాలనుండి ఆడికి జరమొస్తుంది బాబూ. చేతిలో చిల్లిగవ్వలేదు. దరమాసుపత్రికి పోతే, రంగు నీళ్లిచ్చిండ్రు. ఆ నీళ్లకు జబ్బు నయం కాలా. సీనివాస మూరితిగారి దగ్గరికిపోయి బతిమలాడినా బాబూ, 'నేను పచ్చేలోగా మీ ఋణం తీరుస్తాను. నా కొడుకు జబ్బు నయం చెయ్యదొరా' అని. ఆయన కల్లేదు పొమ్మన్నాడు. పొద్దుటి నుంచి, ఒకటే కల వరింత బాబూ నాకు బయం వేస్తున్నది బాబూ అయ్యగోరి నన్ను అడిగి పది రుపాయలిప్పించమకు పోద మని వచ్చినా అరు లెరంటిరి. మీరుగాని, పది రూపాయలు దయచేయిత్తిరా, మీ మేలు ఈ జనమలో మరసిపోను' అన్నాడు దీనంగా. అతడి కళ్లలో నిలచిన నీటిని చూసి నా హృదయం ద్రవించి పోయింది.

లోపలికి పరుగెత్తి, మా ఫామిలీడాక్టరు గారికి ఫోన్ చేశాను. హఠాత్తుగా జ్వరం వచ్చిందని, టెంపరేచర్ ఎక్కువ ఉందని. వెంటనే బయలుదేరమని.

'ఇప్పుడే వస్తున్నాను' అన్నారు ఆయన.

'డాక్టరుగారు వస్తామన్నారు. ఇక భయపడవలసిన పనిలేదు.' అన్నాను వీరయ్య దగ్గరకువచ్చి.

'ఇక నేం బయంలేదు' అన్నాడు సంతోషంతో ఉప్పొంగి పోతూ.

'ఇంతకూ, ఏ డాక్టరు దగ్గరికి నీవు వెళ్లింది' అడిగాను అతడు చెప్పిన డాక్టరు పేరు గుర్తుకురాక.

'ఆరేనండి కాపు ఈది మొగల ఉంటారు. సీనివాస మూరితి. ఆరి దగ్గరికి' అన్నాడు.

'ఓహో' అప్రయత్నంగా అన్నాను.

శ్రీనివాసమూర్తిగారు, ఆ ఊళ్లో పేరుమోసిన డాక్టరు. బాగా ఆర్జించాడు కూడా. రోటరీ క్లబ్ కార్యవర్గ సభ్యుడు,

# ఎవరు నీచులు?

ఇదివరకో రోటరీ క్లబ్ నిర్వహించిన ఉచితవైద్య శిబిరంలో ఎంతోమంది బీదలకు ఆరోగ్యదానం చేశారు. కాని తనంత తానుగా, విషమస్థితిలో ఉన్న ఒక బీదవాడిని ఆదుకోలేకపోయారు ఆయన మరి. వీరయ్య కొడుకుని ఆరోగ్యవంతుడిగా చేసినందువలన ఆయనకు లభించేది ఏమీ ఉండదు. క్లబ్ తరఫున బీదలకు వైద్య సహాయము చేసినప్పుడు, ఆయన సేవలకు ఎంతో ప్రచారం లభించింది. ఇప్పుడలాంటి అవకాశం లేదుకదా?

పది నిముషాల్లో, ఇంటిముందు, డాక్టరుగారి కారు ఆగింది.

చిరునవ్వుతో స్వాగతం చెప్పిన నన్ను చూసి ఆయన ఆశ్చర్యపోయారు

పరిస్థితినంతా ఆయనకు వివరించి చెప్పాను. 'నిజం చెబితే మీరు రారేమోనన్న అనుమానంకొద్దీ, అబద్ధమాడవలసి వచ్చింది. మరేమీ అనుకోకండి అతడి కొడుకు జబ్బునయం అయ్యేట్లు చూడండి' అని ప్రాధేయపడ్డాను.

'తల్లిలేని పిల్లాడు బాబూ కనికరించండి' అన్నాడు వీరయ్య

ఒక్కక్షణం వీరయ్య ముఖంవైపు, నా ముఖంవైపుచూసి, 'సరే పదండి' అన్నారు. వీరయ్య కొడుకును చూడగానే గతుక్కుమన్నారు డాక్టరుగారు. అనుమాన నివృత్తి కోసం, చెయ్యి పట్టుకు చూశారు.

దీర్ఘంగా నిట్టూర్చుతూ, 'ఇక నేను చేయవలసింది, చేయగలిగింది ఏమీ లేదు. నీ కొడుకు నిన్ను వదలి వెళ్లిపోయాడు' అన్నారు వీరయ్య నుద్దేశించి.

డాక్టరుగారి మాటలు విని వీరయ్య గుండెలు బాదుకున్నాడు. 'నన్నొదలి, నీవు కూడా పోయినావా శంకరిగా. నేనేమైపోవాలి' అంటూ హృదయవిదారకంగా విలపించ సాగాడు.

ఆ దృశ్యాన్ని చూస్తూ, అక్కడ ఉండలేకపోయాను. ఆ ఇల్లులాంటి గూడునుండి బయటపడ్డాను నా వెనుకనేవచ్చిన డాక్టరుగారు 'ఇలాంటి సంఘటనలు ప్రతినిత్యం జరుగుతూనే ఉంటాయి వీటిని గురించి ఆలోచిస్తూ కూర్చుంటే, మనం ఏపనీ చెయ్యలేము' అన్నారు నా భుజం తట్టుతూ.

కాని, బాధపడకుండా ఉండలేకపోయాను. ఇంటికి వచ్చినతర్వాత నౌకరు చేత పది రూపాయలు పంపాను, దహన సంస్కారానికి. అంతకంటె నేను చేయగలిగే సహాయం ఏముంది కనుక?

ఆ రాత్రి పడుకోబోయేముందు డైరీ తెరిచాను, ఆ రోజు జరిగిన సంఘటనలను గురించి వ్రాయడానికి.

'ఈ రోజు నా జీవితంలో చాలా ముఖ్యమైనది. ఎన్నో కఠోరసత్యాలు తెలుసుకొనే అవకాశాన్ని కల్పించిన ఈ రోజును, జీవితంలో మరువలేను' అని మొదలుపెట్టాను. మొట్టమొదటిగా, ఉదయం పత్రికలో చదివిన కథలో, రాజకీయనాయకులను గురించి రచయిత వెలిబుచ్చిన అభిప్రాయం స్ఫురణకు వచ్చింది. ఆ కథలో, రాజకీయనాయకులను మాత్రమే దుర్మార్గులుగా వర్ణించాడు రచయిత. కాని, తన స్వార్థంకోసం మంత్రిగారిని అవినీతి మార్గం వైపు మళ్లించబూనిన మామయ్య, విద్యార్థులకు ఆదర్శప్రాయంగా ఉండడానికి బదులు నైతికంగా పతనమైన మాధవరావుగారు, విద్యాసంస్థలను వ్యాపారసంస్థలుగా మార్చుతున్న, ధనికులకు పెద్దమనుష్యులకు సహాయం చేస్తూ తన వ్యక్తిత్వాన్ని నాశనం చేసుకొన్న 'హెడ్', గురువిందగింజ సామెతను స్ఫురణకు తెచ్చే విధంగా ప్రవర్తించిన పత్రికా సంపాదకుడు, 'వ్యాపారంలో' నీతికి, నిజాయితీకి స్థానం లేదంటూ ఆత్మవంచన చేసుకుంటున్న మేనేజరు, ఆయన అభిప్రాయముతో ఏకీభవించి నాన్న, అవినీతి పరుడైన 'కమర్షియల్ టాక్స్ ఆఫీసరు', ప్రచారం లభిస్తేనే తప్ప లేదంటూ సహాయాన్ని బీదవారిపై చలికించ నిరాకరించిన శ్రీనివాసమూర్తిగారు, పరమ దుర్మార్గులుగా కనిపించారు, నా కళ్లకు నాకు తెలియని దుర్మార్గులు ఇంకా ఎందరు ఉన్నారో?

ఈ విషయాలన్నీ ఒక చిన్న కథలా వ్రాశాను డైరీలో.

మంచముమీద వాలి కళ్లు మూసుకున్నాను. హఠాత్తుగా, సురేంద్రనాథ్ బెనర్జీగారు, తరవాత ఆయిదు సంవత్సరాల క్రితం చెప్పిన సుభాషితం జ్ఞప్తికి వచ్చింది.

'ప్రజలు గొప్పవారయితే ప్రభుత్వం నీచమయింది కాజాలదు ప్రజలు అల్పులయి నప్పుడు ప్రభుత్వం గొప్పది కాజాలదు.' ●